క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ : వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు(గురువారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ బుధవారం తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేష్ కాలనీ, వివేకనంద కాలనీ, కాశిబుగ్గ సొసైటీ కాలనీ, ఎరుకల వాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటనలో వివరించారు.

నియామకం


వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్‌గా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈమేరకు కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ ప్రకటించారు.

'కడియం' దళిత వ్యతిరేకి



నయీంనగర్ : బీజేపీని దళిత వ్యతిరేక పార్టీ అన్న కడియం శ్రీహరే అసలు దళిత వ్యతిరేకి అని బీజేపీ దళిత్ మోర్చా రాష్ట్ర నాయకులు చిలుక విజయరావు, బన్న ప్రభాకర్ అన్నారు. బుధవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ దళిత్ మోర్చా పూర్తి మద్దతు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఉందన్నారు.కడియం కావ్యను వరంగల్ ప్రజలు ఓడిస్తారని బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో బొజ్జపల్లి సుభాష్, మార్టిన్ లూథర్, జన్ను మధు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కాశిబుగ్గ : జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20మంది పేద ముస్లింలకు బియ్యం, నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. 18వ డివిజన్ ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రహీమ్‌ఖాన్ సరుకులు అందజేశారు.కార్యక్రమంలో సభ్యులు పవన్‌కుమార్, ఆజీమ్‌పాష, సుభాన్, ఫాహిమ్ పాల్గొన్నారు.

అరుణకీర్తికి ఆహ్వానం

హన్మకొండ అర్బన్ : చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయంలో గల తెలుగు శాఖ ఆధ్వర్యంలో రేపు (శుక్రవారం) జరిగే ఉగాది వేడుకలకు నగరానికి చెందిన రచయిత్రి, కవయిత్రి గంకిడి అరుణకీర్తి పతాకారెడ్డికి ఆహ్వానం అందినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

రెస్టారెంట్ సీజ్

రామన్నపేట : వరంగల్ నగరం గోపాలస్వామి గుడి సమీపంలోని మిర్చిస్ రెస్టారెంట్‌లో నాసిరకం ఆహారం విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తనిఖీ చేసి రెస్టారెంట్‌ను సీజ్ చేయడంతో పాటు రూ.50 వేల జరిమానా విధించారు. సేకరించిన ఆహారాన్ని ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి

హసన్‌పర్తి : మండలంలోని ముచ్చర్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు రూ.24,510 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ముచ్చర్లలోని హుస్సేన్‌బాను అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బెల్ట్ షాపుపై దాడులు నిర్వహించారు. అనంతరం హుస్సేన్‌బానును అరెస్ట్ చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్ : కుటుంబ కలహాలు, మానసిక వేదనకు గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన ఎండి ముస్తాఫా(30)కు భార్య, పిల్లలున్నారు. కొద్ది రోజులుగా కుటుంబంలో గొడవల జరుగుతున్నాయి. మనస్థాపంతో బుధవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గట్టిగా శబ్ధం రావడంతో ముస్తాఫా తల్లి యాకూబీ చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడి తల్లి మిల్స్‌కాలనీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మున్నీరుల్లా తెలిపారు.

యువతిపై లైంగికదాడి..

- హనుమకొండలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

వరంగల్ క్రైం: యువతిపై ఓ యువకుడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఓ యువతి హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రభుత్వ సంస్థలో నర్సింగ్ శిక్షణ పొందుతుంది. ఆ యువతికి కామారెడ్డికి చెందిన ఓ యువకుడితో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ యువకుడు.. యువతిని కామారెడ్డికి పిలిపించుకుని లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జీరో ఎఫ్ఐఆర్‌ను కామారెడ్డికి బదిలీ చేసినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు.

అభాగ్యులకు ఆశ్రయమేది?


కాజీపేట పట్టణంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న నిరాశ్రయులు

కాజీపేట : అయినవారు దూరమై.. ఆదరణ కరువై.. ఒంటరి జీవితాలను గడుపుతున్న నిరాశ్రయులు కాజీపేట పట్టణంలో అవస్థలు పడుతున్నారు. రహదారుల డివైడర్లు, ఫుట్‌పాత్‌లే వారికి ఆవాసాలవుతున్నాయి. పొద్దంతా అక్కడ.. ఇక్కడ తిరిగిన సూరీడు అస్తమించే సమయానికి ఎక్కడున్న వారంతా వీటిపై చేరుతున్నారు. రణగొణ ధ్వనులు, రోడ్డుపై సంచరించే జనాల అలికిడి మధ్య కాలం వెళ్లదీస్తున్న వీరిని ఎవరూ పట్టించుకోవడం లేదు. చలి, వానను తట్టుకోలేక అలమటిస్తున్నారు. ఉదయం పూట అన్నపూర్ణ కేంద్రాల్లో రూ.ఐదుల అన్నం.. రాత్రి వేళల అన్నదాతలు ఇచ్చే ఆహారపు ప్యాకెట్లే ఆకలి తీరుస్తున్నాయి. కాజీపేట పట్టణంలో రైల్వే జంక్షన్ ఉండడంతో అనాథలు, మతిస్థిమితం లేని వారితో పాటు ఇళ్ల నుంచి అలిగి వచ్చే వారి సంఖ్య నానాటికి పెరిగిపోతుంది. ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న అనాథలకు తరచూ రైల్వే పోలీసులతో పాటు సివిల్ పోలీసుల వేధింపులు తప్పడం లేదు. లాఠీ దెబ్బలు సర్వ సాధారణంగా మారాయి. ఇలాంటి వారికోసం రాత్రి వసతి గృహాలు నిర్మించి ఆశ్రయం కల్పించాలని కోర్టులు ఆదేశించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. గతంలో కాజీపేట బ్రిడ్జి కింద అనాథలకు నిలువ నీడ కల్పించడం కోసం ప్రత్యేక ఆశ్రమం ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మరో నాలుగు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయనే సమయంలో ఏం జరిగిందో కానీ మిన్నకుండిపోయారు. దీంతో ఏక్ నిరంజన్‌గా మిగిలిన అనాథలకు, వలసదారులకు రాత్రి పూట ఫుట్‌పాత్‌లే దిక్కుగా మారాయి. ఇప్పటికైనా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు స్పందించి కాజీపేట పట్టణంలో నిరాశ్రయులకు నిలువ నీడ కల్పించి చేయూతనందించాలని పలువురు కోరుతున్నారు.

అనాథలను చూస్తే బాధేస్తుంది

పట్టణ రహదారులపై అనాథలు తిరుగాడుతుంటే మనస్సుకు ఎంతో బాధనిపిస్తుంది. రోడ్లపై ఓ ఐదు, పది అడుక్కోవడం, ఎవరైనా దయతలచి ఇంత ఆహారం పెడితే తింటూ ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటారు. వీరందరికి పట్టణంలో ఓ ఆశ్రయం కల్పించేలా పాలకులు దృష్టి సారించాలి.

- తేలు సారంగపాణి, కాజీపేట

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మడికొండ : కాజీపేట మండలంలోని మడికొండ, టేకులగూడెం గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించిన కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. దళారులకు అమ్ముకొని మోసపోవద్దని పేర్కొన్నారు. కాజీపేట మండల వ్యవసాయాధికారి డి.శ్రీధర్‌రెడ్డి, ఏఈఓ జయప్రకాశ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సన్మానం


మార్కండేయను సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో బుధవారం ట్రై సిటీ క్రైస్తవ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికైన బిషప్ డాక్టర్ జాన్ మార్కండేయను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి సన్మానించారు. డివిజన్ బాధ్యులు పసునూరి మనోహర్‌తో పాటు కార్యకర్తలు మార్కండేయను సత్కారించారు. కొమరవెళ్లి రమేష్, ఇప్ప శ్రీకాంత్, తిరుపతి, ప్రశాంత్, వినయ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కాజీపేట అర్బన్ : ఇటీవల మృతిచెందిన ఆటో డ్రైవర్ సాధినేని శ్రీనివాస్ కుటుంబానికి శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి ఆటో యూనియన్, కడిపికొండ బొడ్రాయి అడ్డా గౌరవ అధ్యక్షులు సాధినేని సుధాకర్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.15,500 ఆర్థికసాయం, 125 కిలోల బియ్యం అందజేశారు. కంకణాల సంపత్‌రెడ్డి, గజ్జెటి హనుమయ్య, నర్మెట్ట రాజు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు


అభినందిస్తున్న ప్రెస్ క్లబ్ కార్యవర్గం

నయీంనగర్ : ఇటీవల వరంగల్ బార్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా విజయం సాధించిన న్యాయవాది, క్లబ్ సభ్యుడు తీగల జీవన్ గౌడ్‌ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ లో అభినందించారు. ప్రెస్ క్లబ్ కార్యకలాపాలకు అవసరమైన న్యాయ సలహాలు ఉచితంగా అందిస్తున్న జీవన్ గౌడ్ బార్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

హన్మకొండ చౌరస్తా : కరుణామయ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ చౌరస్తా, బస్టాండ్, అదాలత్ ప్రాంతాల్లో రోడ్లపై భిక్షాటన చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. సొసైటీ సెక్రటరీ బొచ్చు అపర్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలు, అనాథలకు అన్నదానం చేసినట్లు బాధ్యులు తెలిపారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కండువా కప్పి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

హన్మకొండ : హనుమకొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. మంగళవారం రాత్రి కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూల రాముగౌడ్, బీఆర్ఎస్ 60వ డివిజన్ అధ్యక్షులు మట్టేపల్లి రామరాజు, యువ నాయకులు సూరజ్, అరవింద్, ప్రవీణ్ కుమార్ చారి, దిలీప్, మహేష్, ప్రవీణ్, భరత్, సుమంత్, గణేష్, శేఖర్, అశోక్, అభినయ్, కమల్, పి.భరత్, సుమంత్‌తో పాటు పలువులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ సమక్షంలో చేరగా ఆయన కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి అంకిత భావంతో పని చేయాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, నాయకులు అభినవ్ భాస్కర్, పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్, మాచర్ల కుమార స్వామి, దొంగల కొమరయ్య, పి.రాజి రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

'పదేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

నయీంనగర్ : బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మళ్లీ కొబ్బరికాయలు కొడుతున్నారని, పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ముంటే నగర అభివృద్ధికి ఎవరు ఏం చేశారో చెప్పేందుకు భద్రకాళీ అమ్మవారి సాక్షిగా చర్చకు సిద్ధమా..అని సవాల్ విసిరారు. నాలుగు నెలల్లో మీరు తెచ్చిన నిధులెన్నో బయటపెట్టాలని, అబద్ధపు ప్రచారాలను మానుకోవాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చెన్నం మధు, ఇమ్మడి రాజు లోహిత, రాజు నాయక్, బొంగు అశోక్ యాదవ్, డి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- సీఆర్పీఎఫ్ కమాండెంట్ మోహన్


ర్యాలీ నిర్వహిస్తున్న జవాన్లు

హసన్‌పర్తి : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని సీఆర్పీఎఫ్–58 బెటాలియన్ కమాండెంట్ ఎం.మోహన్ అన్నారు. సీఆర్పీఎఫ్–58 బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కమాండెంట్ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఇళ్లు, పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిఏడాది స్వచ్ఛఅభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా కేయూ పోలీస్‌స్టేషన్, కాకతీయ యూనివర్సిటీ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. సెకండ్ ఇన్ కమాండెంట్ అరుణ్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్‌లు తులసీ, సుమ, భార్గవి పాల్గొన్నారు.

కడియం కావ్యకే ఎమ్మార్పీఎస్ మద్దతు

- రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న


మద్దతు ప్రకటించి సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యకే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ (మేడి పాపయ్య) అధ్యక్షుడు మేడి పాపయ్య తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్యను బుధవారం హనుమకొండలోని వారి నివాసంలో కలిసి సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. ఇరువురిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మేడి పాపయ్య, ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకన్న మాట్లాడారు. మాదిగల సంపూర్ణ మద్దతు కడియం కావ్యకే ఉంటుందని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్, ఉపాధ్యక్షుడు కొమ్మగాని దాసు, అధికార ప్రతినిధి కొమ్ముల భిక్షపతి, వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ వక్కల కుమార్, నాయకులు కొమురయ్య, కలిమెంట్, మహాలక్ష్మి, ఎలీషా, వెంకటమ్మ, ఆనందం, ప్రసాద్, జోసెఫ్, బాలస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ


కరపత్రాలు పంచుతున్న రావు పద్మ, నాయకులు

హన్మకొండ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరిందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బుధవారం హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లో లాబార్థి సంపర్క్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను రావు పద్మ, ఆ పార్టీ నాయకులు కలిశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని వాటిని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీకి అండగా నిలిచి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వేణు, శ్రీనివాస్, సదానందం, ధనలక్ష్మి, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ నియంతృత్వాన్ని అడ్డుకుందాం

- కడియం కావ్యకు మద్దతు ఇవ్వండి
- సీపీఐ నాయకులను కోరిన ఎమ్మెల్యేలు రేవూరి, శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలతో సీపీఐ నాయకులు

న్యూశాయంపేట : రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, ప్రశ్నించే గొంతుకులను అణిచివేస్తున్న మోదీ నియంతృత్వాన్ని అడ్డుకునేందుకు సీపీఐ ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు పలకాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీపీఐ నాయకులను కలిసి కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూత్వ వాదంతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారన్నారు. తమ మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, ఐటి లాంటి సంస్థలను ప్రయోగిస్తూ ప్రశ్నించే గొంతుకలను లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కడియం కావ్యకు మద్దతు ఇచ్చి గెలుపుకోసం కృషిచేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని వారికి తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు విజయ సారథి, జ్యోతి, సీహెచ్ రాజారెడ్డి, కర్రె భిక్షపతి, మేకల రవి, కరుణాకర్, రమేష్, శ్రీనివాస్, షేక్ బాషుమియా, సుగుణమ్మ, టి.భిక్షపతి, ఎల్లేశ్, బీఆర్‌లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ నాయకులు

హన్మకొండ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావులకార్ వెంకటేశ్, రాజేశ్వరయ్య చారి బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, చంటి పిల్లలున్న తల్లులు, ఆర్నెళ్లలోపు ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అలాగే వేసవి దృష్ట్యా ట్రైనింగ్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

జంక్షన్‌ను కాపాడేందుకు త్యాగాలకు సిద్ధం


మాట్లాడుతున్న యాదవరెడ్డి

కాజీపేట : ఉమ్మడి వరంగల్‌లో అతి కీలకమైన ఉత్తర–దక్షిణాది వారధిగా ఉన్న కాజీపేట జంక్షన్ ఉనికిని కాపాడేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నట్లు జంక్షన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ర యాదవరెడ్డి తెలిపారు. బుధవారం కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు డివిజన్ కేంద్రం ప్రకటన అటకెక్కిందని విమర్శించారు. క్రూ రైళ్ల లింకుల తరలింపు ఇలాగే కొనసాగితే కాజీపేట రైల్వే జంక్షన్ నిర్వీర్యం కావడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే కార్మికుల ప్రయోజనాలతో పాటు అభివృద్ధికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో కె.రవీందర్, దుర్గాప్రసాద్, సంగమయ్య, కొండ్ర నర్సింగరావు, మాస్ సావిత్రి, మహేందర్ రెడ్డి, మల్లేశం, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య ఆధ్వర్యంలో క్రూ లింకుల తరలింపునకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యుడు ఓరుగంటి సాంబయ్య, తొట్టె మల్లేశం, తిక్క సాంబయ్య, శంకర్ నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు


కాజీపేట :ఉత్సవ విగ్రహాలు


రామన్నపేట: పూజ చేస్తున్న పండితులు, కమిటీ సభ్యులు, భక్తులు

రామన్నపేట : నగరంలోని మట్టెవాడలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల వేడుకలు బుధవారం రెండో రోజు కనుల పండువగా నిర్వహించారు.ఉదయం స్వామి వారికి యాగశాల ప్రవేశం, సంతాన వేణుగోపాల సహిత వైనతేయ ఇష్టి, ధ్వజారోహణం, గరుడ ప్రసాదం, సాయంత్రం గరుడ వాహనసేవ, కళధర కూచిపూడి నృత్య క్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాఘవాచార్యులు, ఆరుట్ల రామాచార్యులు, కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, మాజీ కార్పొరేటర్ తోట నవీన్‌కుమార్, పబ్బ విశ్వప్రసాద్, బెజగం రజనీకాంత్, నాగేశ్వర్‌రావు, వెంకటకృష్ణ, నాగరాజు, శ్రీనివాస్,రాజన్న,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు

కాజీపేట : కాజీపేట రైల్వే ఆలయాల సముదాయంలోని సీతారామ స్వామి దేవాలయంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులను బుధవారం పట్టణ పుర వీధుల్లో ప్రత్యేక వాహనంపై భక్తులు ఊరేగించారు. ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి విష్ణుపురి, సోమిడి, రహమత్ నగర్, బాపూజీనగర్, రైల్వే క్వార్టర్స్‌ల మీదుగా దేవత మూర్తులను ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో దేవతామూర్తులకు ఘనస్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీరామనవమి వేడుకలకు ముందు దేవతామూర్తులను పట్టణంలో ఊరేగించడం ఎంతోకాలంగా ఆనవాయితీగా వస్తుంది. భక్తులు ఈనెల 17న రైల్వే దేవాలయాల సముదాయంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని పాలక మండలి సభ్యులు కరపత్రాలను పంపిణీ చేశారు.

కల్యాణ మండపం కలశ పునఃప్రతిష్ఠ


మడికొండ: హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మడికొండ : మడికొండలోని సీతారామచంద్రస్వామి కల్యాణ మండపం, శ్రీరామకోటి స్తూపంపై కలశం పునఃప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యనిర్వహణ అధికారి కె.శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాసు, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరీ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నగరంలో వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నోముల కిశోర్, దొగ్గెల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు సెక్రటరీ వేసవిలో ప్రైవేట్‌గా ఇంటర్ తరగతులు, ఎంసెట్, ఐఐటీ, నీట్ పేర్లతో కోచింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేసిన, అందుకు విరుద్ధంగా నగరంలో చాలా కాలేజీలు తరగతులు నిర్వహిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయన్నారు. వేసవి తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.